పథకాలు సరిగ్గా అందుతున్నాయా?

● లబ్ధిదారుల వద్ద ఆరా తీసిన ముఖ్యమంత్రి ● వీడియో కాన్ఫరెన్స్‌లో మాటామంతీ

చెన్నై, జూలై 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'నీంగళ్ నలమా?' తదితర పథకాలకు సంబంధించి లబ్ధిదారులతో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ గురువారం ఉదయం మాట్లాడారు. సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా లబ్ధిదారులతో మాట్లాడి పథకాలు లబ్ధి చేకూర్చాయా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. అంబేద్కర్ ఔత్సాహిక పారిశ్రామికవేత్తల పథకం ద్వారా లబ్ధిపొందిన కోయంబత్తూరుకు చెందిన చిత్రలేఖ అనే మహిళతో స్టాలిన్ మాట్లాడారు. ప్రభుత్వ రుణంతో తాను ఆటోమొబైల్ విడిభాగాలను ఉత్పత్తి చేసే ఫ్యాక్టరీని సమర్థవంతంగా నడుపుతున్నానని చిత్రలేఖ తెలిపారు. ఆ తర్వాత మైలాడుదురై జిల్లాకు చెందిన దివ్యాంగుడు సంజయ్ తల్లితో కూడా స్టాలిన్ మాట్లాడారు. దివ్యాంగుడైన తన కుమారుడికి ప్రతినెలా రూ.1500 చొప్పున ఆర్థికసాయం అందుతోందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ఆ సహాయానికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. 'ఇన్నుయిర్ కాప్పోం, నమ్మై కాక్కుమ్ 48' పథకం ద్వారా లబ్ధిపొందిన రాణిపేట జిల్లాకు చెందిన మణికంఠన్‌తో, చెంగల్పట్టులో ప్రతినెలా ప్రభుత్వ నగదు సహాయం అందుకుంటున్న దివ్యాంగురాలు సుకన్యతో, అనంతరం ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న అల్పాహార పథకం గురించి రామనాథపురం జిల్లాకు చెందిన బాలిక కీర్తికాశ్రీ తోనూ మాట్లాడి వారెలా లబ్ధిపొందుతున్నారనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులతో భేటీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి ఎస్.మురుగానందం, 'ముదల్వరిన్ ముగవరి' ప్రత్యేక అధికారి డి.మోహన్ తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రభుత్వ పథకాలకు సంబంధించిన లబ్ధిదారులతో మాట్లాడుతున్న సీఎం స్టాలిన్

విక్రవాండిలో 42 సమస్యాత్మక గ్రామాలు

● 24 గంటల పర్యవేక్షణకు పోలీసుల నియామకం

పెరంబూర్, జూలై 4: విక్రవాండి ఉప ఎన్నికలో 42 గ్రామాలు సమస్యాత్మకమైనవిగా గుర్తించి, ఆ గ్రామాల్లో పోలీసులు 24 గంటల పాటు గస్తీ చేపట్టారు. విక్రవాండి శాసన సభ ఉప ఎన్నిక ఈ నెల 10వ తేది జరుగనుండగా, 276 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికల్లో డీఎంకే కూటమి, పీఎంకే కూటమి అభ్యర్థులు పోటీచేస్తుండడంతో, పలు గ్రామాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. డీఎంకే తరఫున మంత్రులు, ఎంపీలు, స్థానిక సంస్థల ప్రతినిధులు, కూటమి పార్టీల నేతలు నియోజకవర్గంలో మకాం వేసి ఎన్నికల ప్రచా రం చేపడుతున్నారు. అలాగే, పీఎంకే తరఫున రాందాస్, అన్బుమణి, మణి, శివకుమార్, ఆ పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు ప్రచారంలో పాల్గొంటున్నారు. నాలుగు రోజులుగా పలు గ్రామాల్లో ఇరువర్గాల మధ్య ఘర్షణలు చెలరేగుతున్నాయి. ఉప ఎన్నిక భద్రతా చర్యల్లో భాగంగా తొలివిడతగా 200 మంది బెటాలియన్ పోలీసులు బుధవారం విక్రవాండికి చేరుకున్నారు. బుధవారం అసరాంకుప్పంలో డీఎంకే నేతలు ఓటర్లకు బహుమతులు, నగదు పంచుతున్నారంటూ పీఎంకే కార్యకర్తలు అడ్డుకోవడంతో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. దీంతో, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పళని నేతృత్వంలో ఆ గ్రామాల్లో చేపట్టాల్సిన భద్రతా చర్యలపై సమావేశం నిర్వహించారు. కానై, అరసాంకుప్పం, కొడార్, పనయపురం సహా 42 గ్రామాల్లో హింసలు చెలరేగే అవకాశముందని పోలీసు శాఖ తెలియజేసింది. అయా గ్రామాల్లో షిఫ్టు పద్ధతిలో 24 గంటలు పర్యవేక్షించాలని జిల్లా ఎస్పీ దీపాక్షివాస్ ఉత్తర్వులు జారీచేశారు.



స్వామి వివేకానంద వర్ధంతిని పురస్కరించుకుని గురువారం రాజ్‌భవన్‌లో ఆయన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గవర్నర్ ఆర్ఎన్ రవి

తమిళనాడులో తెలుగును బతికించండి

● చంద్రబాబుకు కేతిరెడ్డి వినతి

● త్వరలోనే స్టాలిన్‌తో మాట్లాడతా

● చంద్రబాబు హామీ

చెన్నై, జూలై 4 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులో తెలుగుభాషను బతికించాలని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని కలిసి తమిళనాడు తెలుగు యువశక్తి అధ్యక్షుడు కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి విజ్ఞప్తి చేశారు. అమరావతిలో బుధవారం చంద్రబాబును కలిసి న కేతిరెడ్డి.. ఈ మేరకు వినతిపత్రా న్ని అందజేశారు. "ఐదేళ్ల క్రితం తమిళనాడులో భాషాపరమైన సమస్య తలెత్తినప్పుడు మీరు జోక్యం చేసుకుని, తమిళనాడు ముఖ్యమంత్రులతో మాట్లాడి సమస్యను కొంత మేరకు పరిష్కరించినందుకు మీకు కృతజ్ఞతలు. అయితే గత ఐదేళ్లుగా పరిస్థితి ఇందుకు భిన్నంగా వుంది. తమిళనాడులో సమస్య పరిష్కారం కోసం గళమెత్తగా.. 'తెలుగు మాధ్యమంలో చదువుకునే అవకాశం ఆంధ్రప్రదేశ్‌లోనే లేకపోతే, ఇక్కడ అలాంటి అవకాశం కావాలని మమ్మల్ని ఎలా అడుగుతారు?' అంటూ తమిళ నేతలు, అధికారులు తిరస్కరిస్తున్నారు. అందుకే ఈ సమస్య పరిష్కారం కోసం మిమ్మల్ని ఆశ్రయించాను. 1982 మే 28న తెలుగుదేశం పార్టీ తొలినాళ్లలో పార్టీ వ్యవస్థాపకులు ఎన్టీ రామారావు విడుదల చేసిన తెలుగు భాషా విధానాన్ని పరిశీలించి, ప్రజానుకూల చర్యల అమలుకు పూనుకోండి. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో కనీసం పదవ తరగతి వరకు మాతృభాషలో మాత్రమే విద్యాబోధన ఉండేలా చర్యలు తీసుకోండి. తమిళనాడుతో పాటు ఆంధ్రేతర రాష్ట్రాల్లో జీవిస్తున్న తెలుగువారి పిల్లల కోసం జనాభా దామాషా ప్రకారం పాఠశాలలు ఏర్పాటు చేసేలా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురండి. తమిళనాడులో తెలుగుభాషాభివృద్ధి కోసం, తెలుగు మాధ్యమంలో పిల్లలు చదువుకునేలా ఇక్కడి ప్రభుత్వంతో మాట్లాడి ఒప్పించండి. అని కేతిరెడ్డి ఏపీ ముఖ్యమంత్రికి ఇచ్చిన వినతిపత్రంలో అభ్యర్థించారు. ఆయన వినతులను ఆలకించిన చంద్రబాబు.. త్వరలోనే తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్‌తో మాట్లాడతానని హామీ ఇచ్చినట్లు కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. తెలుగుభాషా సమస్య పట్ల ఎంతో సానుకూలంగా స్పందించిన చంద్రబాబుకు ఈ సందర్భంగా కేతిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.



చంద్రబాబుకు వినతిపత్రం అందజేస్తున్న కేతిరెడ్డి జగదీశ్వర రెడ్డి

ఎగసిపడ్డ అలలు

● పట్టినంబాక్కంలో కోతకు గురైన తీరం

ప్యారీస్, జూలై 4: స్థానిక మైలాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని పట్టినంబాక్కం సముద్రంలో ఎగిసిపడుతున్న అలల తాకిడితో తీరప్రాంతం కోతకు గురైంది. దీంతో, ఆందోళనకు గురైన జాలర్లు తమ ప్రాంతంలో కోత నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలంటూ రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తిరువళ్లూర్ జిల్లా పళవేర్కాడు-కాట్టుపల్లి మధ్య బుధవారం సముద్రంలో అలలు ఎగిసిపడడంతో ఆ ప్రాంతం ఎడారిని తలపించేలా రోడ్లన్నీ ఇసుకమయం అయ్యాయి. పొన్నేరి నియోజకవర్గ పరిధిలోని మీంజూరు సమీపంలో ఉన్న పళవేర్కాడు-కాట్టుపల్లి మధ్య ఉన్న రహదారిలో ఇసుక భారీస్థాయిలో పేరుకుపోవడంతో ద్విచక్ర వాహనదారులు ఇబ్బందుల పాలయ్యారు. పళవేర్కాడు సమీపంలోని బంగాళాఖాతంలో అలలు ఉవ్వెత్తున ఎగసిపడడంతో స్థానికులు మళ్లీ సునామీ వస్తుందేమోనని భయభ్రాంతులకు గురయ్యారు. ఎన్నూర్ సమీపంలో పళవేర్కాడు చెరువు, సముద్రం కలిసే ముఖద్వారంలో ఇసుక మేటలు భారీగా పేరుకుపోవడంతో కాట్టుపల్లి ప్రాంతం నుంచి అత్తిపట్టు, మీంజూరు, కాట్టూరు, వంజివాక్కం, తిరుపాలవనం మీదుగా కాట్టుపల్లికి 40 కి.మీ దూరం చుట్టుకొని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో, బంగాళాఖాతంలో పశ్చిమ దిశ గాలుల వేగంలో మార్పుల కారణంగా అలల ఉధృతి అధికంగా ఉంది. గురువారం ఉదయం సాధారణం కంటే సుమారు 5 అడుగుల మేర అలలు ఎగిసిపడడంతో, నీటి ఉధృతికి తీరప్రాంతం కోతకు గురైంది.



భారీ అలల తాకిడితో కోతకు గురైన సముద్రతీరం



మూసివున్న పెట్రోల్ బంక్‌లో రెండువేల లీటర్ల మెథనాల్ స్వాధీనం

పెరంబూర్, జూలై 4: కళ్లకుర్చి కల్తీ సారా ఘటనలో పుదుచ్చేరి మాదేష్ ఇచ్చిన సమాచారంతో పెట్రోల్ బంక్‌లో దాచిన మెథనాల్‌ను స్వాధీనం చేసుకున్నారు. కళ్లకుర్చిలో గత నెల 18వ తేది మెథనాల్ కలిపిన కల్తీ సారా తాగి అనారోగ్యానికి గురైన 229 మంది కళ్లకుర్చి, పుదుచ్చేరి జిప్మర్, సేలం, విల్లుపురం తదితర ఆస్పత్రుల్లో చేరారు. చికిత్స పొందుతూ ఇప్పటివరకు 65 మంది మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ కారణంగా జిల్లా కలెక్టర్ బదిలీ కాగా, ఎస్పీ సహా పలువురు అధికారులపై సస్పెన్షన్ వేటుపడింది. అనంతరం ఈ ఘటనపై ప్రభుత్వం సీబీసీఐడీ విచారణకు ఆదేశించింది. సీబీసీఐడీ ఏడీఎస్పీ గోమతి నేతృత్వంలో పోలీసులు విచారణ చేపట్టి 21 మందిని అరెస్ట్ చేశారు. ఈ కేసులో అరెస్ట్ చేసిన కన్నుకుట్టి అలియాస్ గోవిందరాజ్, ఆయన భార్య విజయ, చిన్నదురై, నడుప్పయన్, కదిరవన్, కన్నన్, పుదుచ్చేరి మడుకరై మాదేష్, శక్తివేల్, శివకుమార్, బన్సీలాల్, గౌతమ్‌చంద్ జైన్ తదితర 11 మందిని ఐదు రోజుల కస్టడీకి అప్పగించాలని కోరుతూ గత నెల 28న సీబీసీఐడీ కళ్లకుర్చి ప్రిన్సిపల్ క్రిమినల్ కోర్టులో పిటిషన్ వేసింది. ఈ కేసు విచారణ ఈ నెల 1వ తేది జరగ్గా, 11 మంది నిందితులను పోలీసులు కోర్టులో హాజరుపరిచారు. విచారణ అనంతరం వీరిని 1 నుంచి 3వ తేది వరకు పోలీసు కస్టడీకి అనుమతిస్తూ న్యాయమూర్తి శ్రీరామ్ ఉత్తర్వులు జారీచేశారు. మూడు రోజుల విచారణ అనంతరం 11 మందిని సీబీసీఐడీ పోలీసులు బుధవారం కడలూరు కేంద్ర కారాగారానికి తరలించారు. అరెస్టయిన వారిలో ముఖ్యుడైన పుదుచ్చేరి మడకరై మాదేష్ పోలీసులకు ముఖ్యమైన సమాచారం అందించినట్లు సమాచారం. అతను తన వాంగ్మూలంలో... వీరుపెరుమానల్లూర్ ప్రాంతంలో మూసివేసిన పెట్రోల్ బంక్‌లో 2,000 లీటర్ల మెథనాల్ దాచినట్లు తెలిపాడు. ఈ సమాచారం ఆధారంగా పెట్రోల్ బంక్‌కు వెళ్లిన సీబీసీఐడీ పోలీసులు, వీఏఓ సమక్షంలో ఆ పెట్రోల్ బంక్‌కు తాత్కాలికంగా సీలు వేశారు. చెన్నైకి చెందిన రసాయన సంస్థ నుంచి బ్యారల్ రూ.11 వేలు చొప్పున 19 బ్యారల్ మెథనాల్‌ను మాదేష్ కొనుగోలు చేసినట్లు తెలిసింది. అలా కొనుగోలు చేసిన ఒక బారల్ మెథనాల్‌ను రూ.40 వేలకు విక్రయించాడు. ఇందుకోసం భారీ నెట్‌వర్క్ ఏర్పాటు చేసుకున్నానని, మొదటి విక్రయం కళ్లకుర్చిలోనే జరిపినట్లు మాదేష్ తెలిపాడు. కానీ, కళ్లకుర్చిలో ఊహించని విధంగా పలువురు మృతిచెందడంతో, ఇతర జిల్లాల్లో మెథనాల్ విక్రయించేందుకు సమస్యలు తలెత్తాయి. అందువల్ల మిగిలిన మెథనాల్‌ను వినియోగంలో లేని పెట్రోల్ బంక్‌లో దాచినట్లు మాదేష్ తెలియజేశాడు. ఆ ప్రకారం, 2,000 లీటర్ల మెథనాల్ స్వాధీనం చేసుకున్నట్లు సీబీసీఐడీ పోలీసులు తెలిపారు.



మెథనాల్ దాచిన పెట్రోల్ బంక్

చెన్నై సచివాలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్‌ని కలుసుకుని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మూడు క్రిమినల్ చట్టాలను వ్యతిరేకిస్తూ హోంమంత్రికి లేఖ రాసినందుకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్న ఎంపీ విల్సన్, రాష్ట్ర న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎస్.ప్రభాకరన్, తమిళనాడు పుదుచ్చేరి న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎన్.మారప్పన్, కోశాధికారి కె.మురళీబాబు, కార్యదర్శి కార్తికేయన్ తదితరులు



వ్యాపారి కిడ్నాప్ కేసులో 9 మంది అరెస్టు

● వాకీటాకీలు, తుపాకులు స్వాధీనం

చెన్నై, జూలై 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక పల్లావరంలో పది రోజుల క్రితం జరిగిన మందుల వ్యాపారి కిడ్నాప్ కేసులో తొమ్మిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి తుపాకులు, పోలీసుల సంకెళ్లు, వాకీటాకీలను స్వాధీనం చేసుకున్నారు. పల్లావరం సమీపం తిరుముడివాక్కం ప్రాంతంలో అజారుద్దీన్ అనే మందుల వ్యాపారి నివసిస్తున్నారు. జూన్ 22 రాత్రి ఆయన బైకుపై తిరుముడివాక్కం మెయిన్‌రోడ్డులో వెళ్తుండగా కారులో వచ్చిన కొందరు గుర్తు తెలియని వ్యక్తులు తాము పోలీసులమని చెప్పి, చట్టవ్యతిరేకంగా మాదక ద్రవ్యాలు అమ్ముతున్నట్లు తమకు ఫిర్యాదులు వచ్చినందున విచారణకు రమ్మని బలవంతంగా కారులో ఎక్కించుకునేందుకు ప్రయత్నించారు. వారి ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండటంతో అజారుద్దీన్ కారులో ఎక్కేందుకు నిరాకరించారు. దీంతో ఆగ్రహించిన ఆ దుండగులు ఆయనను చితకబాది, సంకెళ్లు వేసి బలవంతంగా కారులో కిడ్నాప్ చేసుకెళ్లారు. కారులో రాత్రంతా ఆయనను పలు ప్రాంతాలకు తిప్పి క్రెడిట్‌కార్డులు, డెబిట్ కార్డులు లాక్కుని వాటి పాస్‌వర్డ్ తెలుసుకుని ఏటీఎంలలో నగదును, సెల్‌ఫోన్ ద్వారా వేలాది రూపాయలను బదిలీ చేసుకున్నారు. మరుసటి రోజు ఉదయం అజారుద్దీన్‌ను ఆర్కాడు ప్రాంతంలో దించి పారిపోయారు. ఆ కిడ్నాపర్ల బెదిరింపులకు భయపడిన ఆ మందుల వ్యాపారి కిడ్నాప్ సంఘటన గురించి పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. ఈ నేపథ్యంలో ఈ నెల ఒకటో తేదీన మళ్లీ ఆ కిడ్నాప్ ముఠా ఆయనకు ఫోన్ చేసి తాము తెలిపే చోటుకు డబ్బు తీసుకురమ్మంటూ బెదిరించారు. దీంతో అజారుద్దీన్ శంకర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వెంటనే రంగంలోకి అజారుద్దీన్ సెల్‌ఫోన్‌లో నమోదైన ఫోన్ నెంబర్ల ఆధారంగా కుంద్రత్తూరు కొలచ్చేరి ప్రాంతానికి చెందిన అరుణ్‌కుమార్, పెరుంబాక్కంకు చెందిన కార్మేగం, కాంచీపురానికి చెందిన సదామ్, కుంద్రత్తూరు ఆంటోని, రాజ్, పమ్మల్ మహమ్మద్ రఫీ, పల్లావరం ఇమ్రాన్, జమీన్‌పల్లావరానికి చెందిన వేలు ముఠాను అరెస్టు చేసి వారి నుంచి వాకీటాకీలు, తుపాకీ, సంకెళ్లు, సెల్‌ఫోన్లు, కిడ్నాప్‌కు ఉపయోగించిన కారు స్వాధీనం చేసుకున్నారు. ఇదే రీతిలో ఆ ముఠా నగరానికి చెందిన ప్రముఖులను బెదిరించి దోపిడీలకు పాల్పడినట్లు విచారణలో తేలిందని కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసు అధికారులు తెలిపారు.



పోలీసుల అదుపులో నిందితులు

సేలంలో అన్నాడీఎంకే నేత దారుణహత్య

చెన్నై, జూలై 4 (ఆంధ్రజ్యోతి): సేలం నగరంలో అన్నాడీఎంకే స్థానిక నాయకుడు, రియల్ ఎస్టేట్ వ్యాపారి షణ్ముగంను గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం అర్ధరాత్రి వేటకొడవళ్లతో దాడిచేసి హత్య చేశారు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తొమ్మిదిమందిని అరెస్టు చేసి, రహస్యప్రదేశంలో విచారణ జరుపుతున్నారు. పాతకక్షల నేపథ్యంలో ఈ హత్య జరిగి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. సేలం కార్పొరేషన్ 55వ వార్డు ఠాగూర్‌వీధిలో నివసిస్తున్న షణ్ముగం (60) కొండలాంపట్టి పార్టీ శాఖ కార్యదర్శిగా ఉన్నారు. అదేవిధంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం కూడా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి 10 గంటలకు షణ్ముగం తన కార్యాలయం నుంచి బైకులో ఇంటికి బయలుదేరారు. ఆ సమయంలో రెండు బైకుల్లో ఆయనను వెంబడించిన గుర్తుతెలియని వ్యక్తులు వేటకొడవళ్లతో దాడి జరిపి పారిపోయారు. తీవ్రంగా గాయపడిన షణ్ముణం అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ విషయం తెలుసుకున్న షణ్ముగం కుటుంబీకులు, బంధువులు స్థానికులు ఆ ప్రాంతానికి చేరుకున్నారు. పోలీసులు కూడా అక్కడికి వెళ్ళి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టంకు పంపాలని నిర్ణయించారు. అయితే కుటుంబీకులు హంతకులను అరెస్టు చేస్తేనే మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు అనుమతిస్తామంటూ రాస్తారోకో నిర్వహించారు. దీంతో రెండు గంటలపాటు పోలీసు అధికారులు షణ్ముగం కుటుంబీకులతో చర్చలు జరిపి హంతకులను వీలైనంత త్వరగా పట్టుకుంటామని హామీ ఇచ్చారు. గురువారం వేకువజాము రెండు గంటలకు పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు పంపారు. హంతకులు ఓ పథకం ప్రకారమే ఈ హత్య చేశారని, తమను ఎవరూ గుర్తించకుండా ఉండేందుకు ముందుగానే హత్యా ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిపివేశారని పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా గురువారం సాయంత్రం షణ్ముగం హత్యకేసులో తొమ్మిదిమందిని పోలీసులు అరెస్టు చేశారు.



షణ్ముగం (ఫైల్‌ఫోటో)

ఈపీఎస్ ఖండన...

తన స్వంత జిల్లా సేలంలో పార్టీ నేత హత్యకు గురికావడం పట్ల అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. హంతకులను అరెస్టు చేసి వారిపై కఠిన చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులకు విజ్ఞప్తి చేశారు.

సమాచార ధ్వని

8 నుంచి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు శిక్షణ

ఐసిఎఫ్, జూలై 4: రాష్ట్రప్రభుత్వ ఔత్సాహిక పారిశ్రామికవేత్తల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 'మీరూ ఒక పారిశ్రామికవేత్త కావొచ్చు' అనే పేరుతో ఈ నెల 8 నుంచి 12వ తేది వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ శిక్షణలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తల పరిచయం, వాణిజ్య విధివిధానాలు, మార్కెటింగ్, బ్రాండింగ్, ఆన్‌లైన్ మార్కెటింగ్, ప్రణాళిక రూపకల్పన, నిధుల నిర్వహణ, ఈఆర్పీ టాలీ, జీఎస్‌టీ, ఈ-వేబిల్ వంటి వాటిపై శిక్షణ ఇస్తారు. ఆసక్తి ఉన్న 18 ఏళ్ల పైబడి, టెన్త్ ఉత్తీర్ణులైన వారు పాల్గొనవచ్చు. ఇతర వివరాలకు 7010143022, 8668102600 అనే నెంబర్లు సంప్రదించవచ్చు.

నేడు విద్యుత్ గ్రీవెన్స్

ఐసిఎఫ్, జూలై 4: స్థానిక ఎగ్మూర్, పెరంబూర్ డివిజన్ ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ గ్రీవెన్స్ జరుగనుంది. ఎగ్మూర్ డివిజన్ పరిధిలోని ఓటేరి కుక్స్ రోడ్డులో ఉన్న ఉప విద్యుత్ కేంద్ర ప్రాంగణం, పెరంబూర్ డివిజన్ పరిధిలో సెంబియం ఉప విద్యుత్ కేంద్ర ప్రాంగణాల్లో జరిగే గ్రీవెన్స్‌కు చుట్టుపక్కల ప్రాంతాల వినియోగదారులు పాల్గొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని అధికారులు తెలిపారు.

జూన్‌లోగా గృహ నిర్మాణాలు పూర్తిచేయండి

ఐసిఎఫ్, జూలై 4: కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల సబ్సిడీతో నిర్మిస్తున్న గృహ నిర్మాణాలను 2025 జూన్‌లోగా పూర్తిచేయాలని రాష్ట్రప్రభుత్వం ఆదేశించింది. శివారు ప్రాంతాల్లో పట్టా స్థలాలు కలిగిన వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఇంటి నిర్మాణానికి తలా రూ.3.5 లక్షల వరకు సబ్సిడీ ఇస్తున్నాయి. ఈ పథకం కింద కేంద్ర ప్రభుత్వం ఆమోదం పొందిన 4.10 లక్షల గృహాల్లో ఇప్పటివరకు 3.10 లక్షల గృహాలు మాత్రమే నిర్మాణం జరిగాయి. మిగిలిన 89,429 గృహ నిర్మాణాలు 2025 జూన్‌లోగా పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది.

8న ఓఎంఆర్‌లో ఆక్రమణల తొలగింపు

ఐసిఎఫ్, జూలై 4: చెన్నై-తిరుచ్చి జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న ఆక్రమణలను ఈ నెల 8వ తేది తొలగించనున్నట్లు రెవెన్యూ శాఖ అధికారులు తెలిపారు. ఈ రహదారిలో ఆక్రమణలు తొలగించాలని అధికారులకు ఫిర్యాదులందాయి. వీటిని తొలగించాలని అధికారులను కలెక్టర్ అరుణ్‌రాజ్ ఆదేశించారు. కలెక్టర్ ఉత్తర్వులతో 8వ తేది చెన్నై-తిరుచ్చి జాతీయ రహదారిలో ఉన్న ఆక్రమణ దుకాణాలు, వాహన పార్కింగ్, గృహాలను పోలీసుల సహకారంతో తొలగించనున్నట్లు అధికారులు తెలిపారు.

రూ.218 కోట్లకు బూడిద విక్రయం

ఐసిఎఫ్, జూలై 4: విద్యుత్ బోర్డు బూడిద విక్రయాలు గత ఏడాది రూ.218 కోట్లకు పెరిగింది. రాష్ట్ర విద్యుత్ బోర్డుకు సేలం జిల్లా మేట్టూరులో 1,440 మెగావాట్లు, తూత్తుకుడిలో 1,050 మెగావాట్లు, తిరువళ్లూర్ జిల్లా అత్తిపట్టులో 1,830 మెగావాట్ల సామర్థ్యంలో థర్మల్ విద్యుత్ కేంద్రాలున్నాయి. వాటిలో విద్యుదుత్పత్తికి ఇంధనంగా ప్రతిరోజు సుమారు 60,000 టన్నుల నేలబొగ్గు వినియోగిస్తున్నారు. అందులో నుంచి వందల టన్నుల బూడిద వస్తోంది. మొత్తం బూడిదలో 20 శాతం ఇటుక తయారీ వంటి చిన్న వృత్తులకు ఉచితంగా అందజేయగా, మిగిలిన బూడిదను ఎక్కువ ధరకు కోరే సంస్థలకు ఇస్తున్నారు. ఆ ప్రకారం, గత ఏడాది రూ.218 కోట్లకు బూడిద విక్రయించినట్లు అధికారులు తెలిపారు.

ఎంబీబీఎస్ అడ్మిషన్ల తరువాతే ఉప వైద్య కోర్సుల కౌన్సెలింగ్

ఐసిఎఫ్, జూలై 4: ఎంబీబీఎస్ అడ్మిషన్ల తరువాతే ఉప వైద్య కోర్సుల కౌన్సెలింగ్ ప్రారంభమవుతుందని వైద్య విద్య, పరిశోధన డైరెక్టరేట్ తెలిపింది. బీఎస్సీ నర్సింగ్, బి.ఫార్మ్ సహా 19 రకాల ఉప వైద్యకోర్సులకు 67,079 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ నెల రెండో వారంలో విద్యార్థుల అడ్మిషన్లు జరుగుతాయని అధికారులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో, ఎంబీబీఎస్‌లో అడ్మిషన్ల తరువాతే ఉప వైద్య కోర్సులకు కౌన్సెలింగ్ జరుగుతుందని వైద్య విద్య విద్యార్థుల ఎంపిక కమిటీ కార్యదర్శి అరుణలత తెలిపారు.

విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

ఐసిఎఫ్, జూలై 4: తమిళనాడు దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నారు. రాష్ట్రానికి తమిళనాడు అని దివంగత మాజీ ముఖ్యమంత్రి అన్నా నామకరణం చేసిన జూలై 18వ తేది 'తమిళనాడు డే'గా జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా అన్ని జిల్లాల్లో 6 నుంచి 12వ తరగతి వరకు పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నారు. మొదటి, మూడు బహుమతులు జిల్లాస్థాయిలో అందజేస్తారు. చెన్నై జిల్లాస్థాయిలో ఈ నెల 9వ తేది అన్నాసాలైలో ఉన్న ప్రభుత్వ మదరాస ఐ ఆజం మహోన్నత పాఠశాలలో పోటీలు జరుగనున్నాయి. విజేతలకు మొదటి బహుమతిగా రూ.10 వేలు, రెండో బహుమతి రూ.7 వేలు, మూడవ బహుమతి రూ.5 వేలు, ప్రశంసాపత్రాలు అందజేస్తారు. నగరంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని మొదటి మూడు స్థానాలు పొందే విద్యార్థులకు ఈ నెల 18న జరిగే తమిళనాడు దినోత్సవ కార్యక్రమంలో బహుమతులు, సర్టిఫికెట్లు అందజేయనున్నారు. పోటీలకు సంబంధించిన శీర్షికలు 'కుమరితండై మార్షల్ నేశమణి', 'తెనాట్టు బెర్నార్డ్ షా పేరరింజర్ అన్నా', 'ముత్తమిళ్ అరింజర్ కలైంజర్ కరుణానిధి'గా సూచించారు.

కేంద్ర మంత్రితో భేటీ ..



'హిందుస్థాన్ ఆవాం మోర్చా' పార్టీ అధ్యక్షుడు, కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి జితన్ రాం మాంజీతో గురువారం ఢిల్లీలో భేటీ అయిన ద్రావిడదేశం అధ్యక్షుడు వి.కృష్ణారావు

విద్యార్థులకు విద్యా సామగ్రి వితరణ

పెరంబూర్, జూలై 4: లయన్స్ క్లబ్ గ్రీన్ సిటీ చెన్నై ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేశారు. తిరువళ్లూర్ జిల్లా కొత్త గుమ్మిడిపూండిలో పనిచేస్తున్న పంచాయతీ యూనియన్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ ఎం.సుందరవరదన్ హాజరై, 300 మంది విద్యార్థులకు వాటర్ బాటిళ్లు, టంబ్లర్ తదితరాలు అందజేశారు. కార్యక్రమంలో గుమ్మిడిపూండి పంచాయతీ మాజీ అధ్యక్షులు ఎం.సెల్వరాజ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.ఇందుమతి, మాజీ ప్రధానోపాధ్యాయులు వెంకటేశన్, లయన్స్ క్లబ్ నిర్వాహకులు లయన్.కన్నన్, కోశాధికారి లయన్.ఎం.అన్నామలై, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. విద్యా సామగ్రి అందజేసిన లయన్స్ క్లబ్ నిర్వాహకులకు ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.



విద్యార్థులతో అతిథులు, లయన్స్ క్లబ్ నిర్వాహకులు

26న ఆంధ్ర భాషా వికాస పోటీలు

దరఖాస్తుల ఆహ్వానం

ప్యారీస్, జూలై 4: రాజధాని నగరంలో పలు ప్రాంతాల్లోని పాఠశాలలో చదువుకుంటున్న తెలుగు మీడియం విద్యార్థుల కోసం అమరజీవి పొట్టిశ్రీరాములు స్మారక సమితి ఆధ్వర్యంలో ఈ నెల 26న ఆంధ్ర భాషా వికాస పోటీలు నిర్వహించనుంది. టి.నగర్ బర్కిత్ రోడ్డులో ఉన్న ఆంధ్ర బాలానందం ప్రాథమిక పాఠశాలలో నిర్వహించనున్న ఈ పోటీలలో పాల్గొనదలచిన విద్యార్థినీ, విద్యార్థులు ఈ నెల 20వ తేదిలోపు తమ పేర్లు నమోదుచేసుకోవాలని సమితి నిర్వాహకులు పిలుపునిచ్చారు. 26వ తేది ఉదయం 10 నుంచి 11 గంటల వరకు 1-3 తరగతులు వేమన శతకంలోని ఐదు పద్యాలు, 4-5 తరగతులు సుమతి, కుమార శతకంలోని ఐదు పద్యాలు, 6-9 తరగతులకు పదవినోదం (పజిల్), టెన్త్ నుంచి ప్లస్‌టూ వరకు వ్యాసరచన, అలాగే, 1 నుంచి 5 తరగతుల వరకు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు చిత్రలేఖనం, 6నుంచి 9 తరగతులకు పద్య పఠనం, టెన్త్ నుంచి ప్లస్‌టూ వరకు కొత్త పద్యాలు (చంపకమాల, ఉత్పల మాల, మత్తేభం, శార్దూలం), అనంతరం మధ్యాహ్నం 2.15 గంటల వరకు దేశభక్తి గేయాలు, లలిత గీతాలు, చిత్రలేఖనం, మధ్యాహ్నం 2.30 నుంచి 3.30 గంటల వరకు మహాత్మాగాంధీ, సుభాష్ చంద్రబోస్, దుర్గాభాయ్ దేశ్‌ముఖ్, పొట్టి శ్రీరాములు, లాల్‌బహదూర్ శాస్త్రి జీవిత చరిత్రల నుంచి అడిగే ప్రశ్నలకు 9 నుంచి 12వ తరగతి విద్యార్థులు సమాధానం చెపాల్సి ఉంటుంది. ఈ పోటీల్లో పాల్గొనదలచిన వారు 9884893503 నెంబరు, amarajeevi2017@ gmail.com అనే ఈ-మెయిల్‌లో ఈ నెల 20లోపు పేర్లు నమోదుచేసుకోవాల్సిందిగా అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక సమితి కార్యవర్గ సభ్యులు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల వార్షికోత్సవాలకు రూ.15 కోట్లు

పెరంబూర్, జూలై4: ప్రభుత్వ పాఠశాలల్లో వార్షికోత్సవాల నిర్వహణకు రూ.15 కోట్లు కేటాయించినట్లు రాష్ట్రప్రభుత్వం తెలిపింది. ప్రభుత్వపాఠశాలల్లో వార్షికోత్సవాలు జరిపేందుకు నిధులు కేటాయించాలని మదురైకి చెందిన మణిభారతి హైకోర్టు మదురై డివిజన్ బెంచ్‌లో పిటిషన్ వేసారు. ఈ పిటిషన్ గురువారం విచారణకు రాగా, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నిధులు కేటాయిస్తున్నట్లు ప్రభుత్వం తెలియజేసింది. అనంతరం న్యాయస్థానం... ప్రైవేటు పాఠశాలల తరహాలో ప్రభుత్వ పాఠశాలల్లో వార్షికోత్సవాలు నిర్వహించడం సాధ్యం కాదని, భవిష్యత్తులో పాఠశాల వార్షికోత్సవాలకు నిధులు పెంచే అంశం పరిశీలిస్తున్నట్లు ప్రభుత్వం తెలిపిదంటూ, పిటిషన్ విచారణ ముగిసినట్లు ప్రకటించారు.

పెళ్లయిన 12 రోజులకే ప్రియుడితో పరారు

చెన్నై, జూలై 4 (ఆంధ్రజ్యోతి): రాజపాళయంలో పెళ్లయిన 12 రోజులకే భర్తను విడిచిపెట్టి భార్య ప్రేమికుడితో పరారైన సంఘటన తీవ్ర కలకలం సృష్టించింది. రాజపాళయం తెన్‌కరై ప్రాంతానికి చెందిన మారీశ్వరి (21) అదే ప్రాంతానికి చెందిన 22 యేళ్ల యువకుడితో జూన్ 21న వివాహం జరిగింది. బుధవారం ఉదయం మారీశ్వరి భర్తతోపాటు పుట్టింటిలో విందు కోసం వెళ్లింది. భోజనాల య్యాక అందరూ నిదురపోయారు. నూతన దంపతులు ఓ గదిలో పడుకున్నారు. గురువారం వేకువజామున భర్త నిద్ర నుంచి లేచి చూడగా భార్య కినిపించలేదు. ఆమె కోసం ఇంటిలో, ఇంటి బయటా వెదికాడు. కానీ ఆమె జాడ తెలియలేదు. ఈ సంఘటన గురించి కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ జరిపారు. ఆ విచారణలో మారీశ్వరి తన ప్రేమికుడు సుబ్బయ్యతో పరారైనట్లు తెలుసుకున్నారు. ఆ ఇరువురి ఆచూకీ కోసం తీవ్రంగా గాలిస్తున్నారు.

పానీ పూరీ దుకాణాల్లో అధికారుల తనిఖీలు



పెరంబూర్, జూలై 4: కోయంబత్తూర్ కార్పొరేషన్‌లోని పలు ప్రాంతాల్లో ఉన్న పానీ పూరీ దుకాణాల్లో గురువారం ఆహార భద్రతా శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో 65 లీటర్ల పానీ పూరీ రసంలో అధిక వర్ణద్రవ్యాలు, 57 కిలోల నాసిరకం బంగాళ దుంపలు స్వాధీనం చేసుకున్న అధికారులు, దుకాణ యజమానులకు జరిమానా విధించారు. ఈ తనిఖీలో కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

సారా తాగి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



జయరామన్ (ఫైల్‌ఫొటో)

పెరంబూర్, జూలై 4: విల్లుపురం సమీపంలో సారా తాగి అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ముగ్గురిలో ఒకరు చికిత్స ఫలించక గురువారం ఉదయం మృతిచెందాడు. టి.కుమారమంగళానికి చెందిన జయరామన్, మురుగన్, శివచంద్రన్ గత శనివారం సారా తాగిన తర్వాత కడుపు మంటతో సమీపంలోని ప్రభుత్వాసుపత్రిలో చేరారు. అక్కడ ప్రాథమిక చికిత్సల అనంతరం మెగురైన చికిత్స కోసం ముండియంబాక్కం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిలో జయరామన్ శుక్రవారం నుంచే సారా తాగుతున్నాడనే వార్తల నేపథ్యంలో, గురువారం చికిత్స ఫలించక మృతిచెందాడు. పుదుచ్చేరి నుంచి సారా తీసుకొచ్చిన మురుగన్‌పై కేసు నమోదుచేసినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు.

బీసీ క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

● రెవ.తాటిపర్తి ఐజక్



తుర పనివారల సమావేశంలో తాటిపర్తి ఐజక్, తెలుగు పాస్టర్లు

ప్యారీస్, జూలై 4: విద్య, ఉద్యోగ రంగాల్లో ప్రభుత్వ రాయితీ పొందేలా బీసీ క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చాలని తుర ఫౌండేషన్ వ్యవస్థాపక డైరెక్టర్ రెవ.తాటిపర్తి ఐజక్ ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు.అయనావరం రైల్వే కాలనీలోని సాల్వేషన్ ఆర్మీ ప్రెయర్ హాల్‌లో గురువారం తాటిపర్తి ఐజక్ అధ్యక్షతన తుర పనివారల సమావేశం జరిగింది. నగరంలోని పలు ప్రాంతాల్లో సేవలందిస్తున్న తెలుగు పాస్టర్లు, బోధకులు హాజరైన ఈసమావేశంలో, నిరుద్యోగం, వ్యాధులు, ఆర్థిక ఇబ్బందులు, కుటుంబసమస్యలు, సంతాన సమస్యలు తొలగాలని, దేశం సుభిక్షంగా ఉండాలని, ప్రపంచంలో శాంతి నెలకొనాలని కాంక్షిస్తూ ప్రార్థించారు. సమావేశంలో ఆమోదించిన ఐదు తీర్మానాలపై సభాధ్యక్షుడు ఐజక్ మాట్లాడుతూ... దేశంలోని పలు రాష్ట్రాల్లో మైనార్టీ వర్గాలపై కొనసాగుతున్న దాడులను కేంద్ర ప్రభుత్వం అడ్డుకోవాలని, అలాగే రాష్ట్రంలో స్థిరపడిన బీసీ క్రైస్తవులను ఎస్సీగా పరిగణించాలని రాష్ట్రప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో భాగంగా తాటిపర్తి కొండయ్య పంచమ స్మారక వర్ధంతి సందర్భంగా ఆయన సతీమణి లచ్చువమ్మ, అయనావరం సాల్వేషన్ ఆర్మీ కాపరి విక్టర్ ఇమ్మానుయేల్‌లతో కలసి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. టీవీ సువార్త ప్రసంగీకులు రెవ.ఓఎస్ ప్రకాశ్‌రాజ్, రెవ.జి.సుందర్‌రాజ్, జి.ప్రేమ్‌కుమార్, వి.యేసుదాసు, ఎ.ఐజయ్య, పి.డానియేల్, రవికుమార్, థామస్ తదితరులు పాల్గొన్నారు.

విదేశాలకు వెళ్లనున్న అన్నామలై

పార్టీ నిర్వహణకు ప్రత్యేక కమిటీ ● పనిచేయని వారిపై చర్యలకు సిద్ధం

అడయార్,జూలై4:బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అన్నామలై ఉన్నత విద్యాభ్యాసానికి విదేశాలకు వెళ్లనున్నారు. ఆయన ఆరు నెలలపాటు విదేశాల్లోనే ఉండనున్నారు. ఈ సమయంలో పార్టీ నిర్వహణ కోసం ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలన్న ఆలోచనలో ఉన్నారు. అదేవిధంగా ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల విజయం కోసం పని చేయని నేతలపై చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. గడిచిన లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ 19 చోట్ల పోటీ చేసి ఒక్క స్థానంలో కూడా గెలుచుకోలేకోయింది. ఇది బీజేపీ అధిష్టానానికి తీవ్ర ఆగ్రహం తెప్పించింది. దీంతో ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయం కోసం పని చేయని వారిని గుర్తించి, వారిపై తగిన చర్యలు తీసుకోవాలని బీజేపీ అధిష్టానం భావిస్తోంది. ఇదిలావుండగా అన్నామలై ఆరు నెలల పాటు ఇంగ్లండ్‌కు వెళ్లాలని భావిస్తున్నారు. ఈ సమయంలో పార్టీ కార్యకలాపాలను చక్కదిద్దేందుకు సీనియర్, జూనియర్ నేతలతో కలిసి ఒక కమిటీని ఏర్పాటు చేయాలని ఆయన భావిస్తున్నారు. విదేశాల నుంచి అన్నామలై తిరిగి వచ్చిన తర్వాత పార్టీకి కొత్త అధ్యక్షుడిని ఎంపిక చేయాలన్న ధోరణిలో అధిష్టానం ఉన్నట్టు ఆ పార్టీ సీనియర్ ఒకరు వెల్లడించారు. దీంతో పార్టీ అధ్యక్ష పదవి కోసం పలువురు సీనియర్ నేతలు ఇప్పటి నుంచే తమ వంతు ప్రయత్నాలు మొదలుపెట్టినట్టు వినికిడి.

యూపీఎస్ ద్వారా టిక్కెట్లు

● ప్రభుత్వ రవాణా శాఖ ప్రకటన

ప్యారీస్, జూలై 4: ప్రభుత్వ రవాణా సంస్థ బస్సుల్లో ప్రయాణికుల సౌకర్యార్థం డిజిటల్ విధానంలో యూపీఎస్ ద్వారా టిక్కెట్లు పంపిణి విధానం అమలుపరిచేందుకు ప్రభుత్వ రవాణాశాఖ చర్యలు చేపట్టింది. ఇప్పటికే మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎంటీసీ) నగరంలో నడుపుతున్న సిటీ బస్సుల్లో ఈ విధానం విజయవంతంగా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో, స్టేట్ ఎక్స్‌ప్రెస్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎస్ఈటీసీ) బస్సుల్లో ఏప్రిల్ 1వ తేది నుంచి యూపీఎస్ ద్వారా ప్రయాణికులకు టిక్కెట్లు ఇస్తున్నారు. ఈ విధానం వల్ల ఎలాంటి అవకతవకలు జరిగేందుకు అవకాశముండదని రవాణా శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం దూరప్రాంతాలకు నడుపుతున్న ఎస్ఈటీసీ బస్సుల్లో ఈ సదుపాయం అందుబాటులోకి వచ్చింది. ప్రయాణికులు గూగుల్ పే, ఫోన్ పే ద్వారా టిక్కెట్ కొనుగోలు చేసి ప్రయాణం చేస్తున్నారు. ప్రయాణికుల్లో డిజిటల్ పరివర్తన విధానాన్ని ప్రోత్సహించేలా పనిచేస్తున్న కండక్టర్లకు బహుమతులు అందజేయనున్నట్లు ప్రభుత్వ రవాణా శాఖ డైరెక్టర్ ఎస్ఈటీసీ డిపోలకు సర్క్యులర్ జారీచేశారు. యూపీఎస్ ద్వారా అధికంగా టిక్కెట్లు ఇచ్చే కండక్టర్లకు నగదు బహుమతి, ప్రశంసాపత్రం అందజేయనున్నట్లు ఆ సర్క్యులర్‌లో తెలిపారు.

కీళడి, వెంబకోటలో లభ్యమైన ప్రాచీన వస్తువులు

ఐసిఎఫ్, జూలై 4: రాష్ట్ర పురావస్తు శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన తవ్వకాల్లో కీళడి, వెంబకోటలో వివిధ రకాల వస్తువులు లభించాయి. పురావస్తు శాఖ రాష్ట్రంలో 8 ప్రాంతాల్లో పరిశోధనలు చేపడుతోంది. వాటిలో విరుదునగర్ జిల్లా వెంబకోటలో మెడలో ధరించే రాతితో తయారుచేసిన ఆభరణం, పచ్చ రంగు రాతి ఆభరణాలు, అలాగే శివగంగ జిల్లా కీళడిలో జరిగిన తవ్వకాల్లో చేప రూపం గీసిన మట్టి కుండ పెంకులు, ఎరుపు రంగు పూసిన కుండ పెంకులు లభించాయి.



చేప ఆకారం చిత్రం ఉన్న కుండ పెంకులు

భర్త మృతి తట్టుకోలేక మహిళ ఆత్మహత్య

ప్యారీస్, జూలై 4: స్థానిక తిరునింద్రవూర్ సమీపంలో భర్త మృతి తట్టుకోలేక భార్య ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు. తిరునింద్రవూర్ తిలకర్ నగర్‌కు చెందిన రాఘవన్ (62) అనే రిటైర్డ్ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి భార్య శివగామి (60)లకు రమేష్ అనే కుమారుడున్నాడు. ఈ నేపథ్యంలో, అనారోగ్యంతో ఉన్న తండ్రిని పరామర్శించేందుకు కుమారుడు రమేష్ తన భార్య, పిల్లలతో కలసి బుధవారం ఇంటికెళ్లాడు. ఆ సమయంలో ఇంటి తలుపులు లోపల వైపు గడి పెట్టి ఉండడంతో ఇరుగుపొరుగు వారి సాయంతో తలుపులు బద్దలుకొట్టి లోపలికెళ్లారు. అప్పుడు రాఘవన్ మంచంలోనే విగతజీవిగా పడి ఉండగా, సమీపంలోనే ఆయన భార్య శివగామి ఉరితాడుకు వేలాడుతూ కనిపించింది. దీనిపై అందజేసిన ఫిర్యాదు మేరకు అక్కడికెళ్లిన పోలీసులు భార్యాభర్తల మృతదేహాలు స్వాధీనం చేసుకొని తిరువళ్లూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనారోగ్యంతో ఉన్న భర్త మృతిచెందడాన్ని తట్టుకోలేని శివగామి ఆయన భౌతికకాయం పక్కనే ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిందని పోలీసుల ప్రాథమిక విచారణలో తెలిసింది.

వేర్వేరు ప్రాంతాల్లో గంజాయి విక్రయాలు

● ఐదుగురి అరెస్టు

అడయార్, జూలై 4: నగరంలోని వివిధ ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తున్న ఐదుగురు వ్యాపారులను పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక పులియంతోపు ప్రాంతంలో జోరుగా గంజాయి విక్రయిస్తున్నట్టు ఆ ప్రాంత ఇన్‌స్పెక్టర్‌కు సమాచారం వచ్చింది. దీంతో మఫ్టీలో నిఘా వేసి ఫిలిక్స్ (22), బేసిన్‌బ్రిడ్జికి చెందిన రాజా (47) అనే ఇద్దరిని అరెస్టు చేశారు. వీరి నుంచి 600 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా, ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్ నుంచి గంజాయి ప్యాకెట్లతో పెరంబూరు రైల్వే స్టేషన్‌కు కొందరు వ్యాపారులు వచ్చారనే సమాచారంతో పోలీసులు అనుమానాస్పద ప్రయాణికులను అదుపులోకి తీసుకుని గాలించారు. ఈ తనిఖీల్లో దిండిగల్ జిల్లా పెన్నాగరం ప్రాంతానికి చెందిన దిసోన్ (26), హేమంత్ రాజా (23), కీల్పాక్కం శాస్త్రి నగర్‌కు చెందిన మణిమారన్ (30) అనే వారిని అరెస్టు చేశారు.

బాలికకు లైంగిక వేధింపులు : చర్చి ఫాదర్ అరెస్ట్


పెరంబూర్, జూలై 4: తల్లి మృతితో కాంచీపురంలో చర్చి హోంలో ఉంటున్న 14 ఏళ్ల బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన చర్చి ఫాదర్ పోక్సో చట్టం కింద కటకటాలపాలయ్యాడు. చిన్న కాంచీపురానికి చెందిన బాధితురాలి తండ్రి, అదే చర్చిలో గార్డెనర్‌గా పనిచేస్తున్నట్లు సమాచారం. భార్య మృతితో కుమార్తెను పర్యవేక్షించలేక తాను పనిచేసే చర్చిలోనే బాలికతో నివాసముంటున్న నేపథ్యంలో, కొద్దిరోజుల క్రితం చర్చి ఫాదర్ దేవి ఇరక్కం బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. బాలిక ఏడుపులతో చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకొని పరిస్థితి గమనించారు. ఈ వ్యవహారంపై పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసిన పోలీసులు, చర్చి ఫాదర్‌ను అరెస్ట్ చేశారు.

పాంబన్ స్వామి ఆలయ కుంభాభిషేకానికి హైకోర్టు గ్రీన్ సిగ్నల్

చెన్నై, జూలై 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరువాన్మియూరులోని పాంబన్ స్వామి ఆలయ కుంభాభిషేకం వేడుకలను జరుపుకునేందుకు మద్రాసు హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్రదేవాదాయ శాఖ ఈ నెల 12న కుంభాభిషేకం జరిపేందుకు సన్నాహాలు చేపడుతున్న సమయంలో కుంభాభిషేకాన్ని నిలుపుదల చేస్తూ స్టే ఇవ్వాలని మయూరాపురం గురుపాంబన్ శ్రీమద్ కుమరగురు దాస్ అన్నదాన సభ అధ్యక్షుడు శరవణన్ దాఖలు చేసిన పిటిషన్‌ను తోసిపుచ్చింది.

ఫిక్కీ ఆధ్వర్యంలో డిజిటల్ లిటరసీపై వర్క్‌షాపు

అడయార్, జూలై 4: ఫిక్కీ ఎఫ్ఎల్‌వో (మహిళా విభాగం) చెన్నై చాప్టర్ ఎంపవర్ మెంబర్స్ ఆధ్వర్యంలో డిజిటల్ లిటరసీపై శ్రేయా బజాజ్ నేతృత్వంలో నగరంలో తాజాగా వర్క్‌షాపు నిర్వహించారు. దాదాపు 800 మందికిపైగా సభ్యత్వం కలిగిన ఈ విభాగం వ్యవస్థాపక స్ఫూర్తిని పెంపొందించడంలో కీలకమైన శక్తిగా ఉంది. ముఖ్యంగా మహిళల హక్కుల కోసం, నాయకత్వ పాత్రలో మహిళా సాధికారతను ఈ విభాగం ప్రోత్సహిస్తుంది. ఇందులోభాగంగా వర్క్‌షాపులు, సెమినార్‌లు, వివిధ రకాల సదస్సులు, శిక్షణలను నిర్వహిస్తూ మహిళల్లో వృత్తిపరమైన నైపుణ్యం, సామర్థ్యాన్ని పెంపొందించే కార్యక్రమాలను చేపడుతోంది. ఇందులోభాగంగా తాజాగా డిజిటల్ లిటరసీపై శ్రేయా బజాజ్, దివ్య అభిషేక్ సారథ్యంలో జరిగింది.



వర్క్‌షాపులో నిర్వాహకులు

8కి సెంథిల్ బాలాజీ కేసు వాయిదా

పెరంబూర్, జూలై 4: బ్యాంక్ దస్తావేజులు అందించాలంటూ మాజీ మంత్రి సెంథిల్ బాలాజీ దాఖలుచేసిన కేసు విచారణ ఈ నెల 8వ తేదీకి వాయిదాపడింది. చట్టవ్యతిరేక నగదు బదిలీ చట్టం కింద, మాజీ మంత్రి సెంథిల్ బాలాజీ గత ఏడాది జూన్ 14న అరెస్టయ్యాయరు. ఆయనకు వ్యతిరేకంగా చెన్నై ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టులో ఛార్జీషీటు దాఖలైంది. ఈడీ నమోదు చేసిన కేసు నుంచి తనను విడిపించాలనే సెంథిల్ బాలాజీ పిటిషన్‌ను చెన్నై ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు వాయిదావేసింది. ఈ క్రమంలో, కేసుకు సంబంధించిన బ్యాంక్ దస్తావేజులు అందించాలని సెంథిల్ బాలాజీ తరఫున పిటిషన్ దాఖలైంది. ఈ కేసు గురువారం విచారణకు రాగా, ఈ నెల 8వ తేది బ్యాంక్ దస్తావేజులకు సంబంధించి ఉత్తర్వులు జారీచేస్తామని న్యాయస్థానం తెలిపింది. కాగా, సెంథిల్ బాలాజీ కేసును 4 నెలల్లో ముగించాలని మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. అలాగే, సెంథిల్ బాలాజీ రిమాండ్ పొడిగిస్తూ చెన్నై ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు ఉత్తర్వులు జారీచేసింది.

చోరీలకు పాల్పడుతున్న 71 మంది అరెస్ట్

పెరంబూర్, జూలై 4: నగరంలో సెల్‌ఫోన్, నగల చోరీలకు పాల్పడుతున్న కేసుల్లో 71 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. గత నెల 20 నుంచి ఈ నెల 3వ తేది వరకు వివిధ ప్రాంతాల్లో జరిగిన ఘటనలకు సంబంధించి ఏడుగురు చిన్నారులు సహా 71మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి ఆరున్నర సవర్ల నగలు, 37.618క్యారట్ల డైమండ్, 19 సెల్‌ఫోన్లు, రూ.9,45,160 నగదు, కెమెరా, రెండు మోటారు సైకిళ్లు, ఆటో, కారు స్వాధీనం చేసుకున్నారు. అలాగే, గత నెల 20 నుంచి ఈ నెల 3 తేది వరకు వాహనాల చోరీకి సంబంధించి 11 కేసులు నమోదుచేసి 11 మందిని అరెస్ట్ చేసి, 11 మోటారు సైకిళ్ల స్వాధీనం చేసుకున్నట్లు గ్రేటర్ చెన్నై పోలీసు ఒక ప్రకటనలో తెలిపింది.

పీఎంకేకు ఓటేయండి...!

● అన్నాడీఎంకే శ్రేణులకు డా.రాందాస్ విజ్ఞప్తి

పెరంబూర్, జూలై 4: విక్రవాండి శాసనసభ ఉప ఎన్నికల్లో పీఎంకే అభ్యర్థికి ఓట్లు వేయాలని అన్నాడీఎంకే శ్రేణులకు పీఎంకే వ్యవస్థాపకుడు డా.రాందాస్ విజ్ఞప్తి చేశారు. ఈ నెల 10వ తేది జరుగనున్న ఉప ఎన్నికలో డీఎంకే, పీఎంకే, నామ్ తమిళర్ పార్టీల మధ్య త్రిముఖ పోటీ నెలకొంది. ఈ ఎన్నికల్లో పోటీచేయడం లేదని ప్రతిపక్ష అన్నాడీఎంకే, డీఎండీకే ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో, గురువారం పీఎంకే నేత రాందాస్ విలేఖరులతో మాట్లాడుతూ...ఉపఎన్నికలో పీఎంకే విజయాన్ని అడ్డుకొనేలా అధికార డీఎంకే కుట్రపూరిత రాజకీయాలకు పాల్పడుతోందన్నారు. పీఎంకేకు ఓట్లు వేస్తే సంక్షేమ పథకాలు ఉండవని, నియోజకవర్గ అభివృద్ధి కూడా జరుగదని ఆ పార్టీ నేతలు ఓటర్లను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. డీఎంకే అగడాలు, ప్రలోభాలు అధిగమించి 40,000 ఓట్ల మెజార్టీతో విజయం సాధించనున్నామని తెలిపారు. అన్నాడీఎంకే శ్రేణులు తమ ఓట్లు వృధా చేసుకోరాదని, అన్నాడీఎంకే, పీఎంకేకు వ్యతిరేకపార్టీ డీఎంకే అని, అందువల్ల ఉప ఎన్నికల్లో ఆ పార్టీశ్రేణులు తమ అభ్యర్థికి ఓట్లు వేయాలని రాందాస్ విజ్ఞప్తి చేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఐసిఎఫ్, జూలై 4: విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

గిండి: ఆదంబాక్కం, శాస్త్రి నగర్, కల్కి నగర్, వినాయకపురం, ఏజీఎస్ కాలనీ 5 నుంచి 7 వీధులు, ఎన్కలోమ్స్ ఫ్లాట్స్, డీఆర్‌పి ఫ్లాట్స్, నల్మా ఫ్లాట్స్, బాలాజీ నగర్ 23 నుంచి 37 వీధులు, ఆలందూర్, మియాట్, బీటీ క్వార్టర్స్, మౌంట్ ఆసుపత్రి, నార్త్ సిల్వర్ వీధి, డిఫెన్స్ కాలని, సిమెట్రి రోడ్డు, నంగనల్లూర్, ఓల్గాస్ కాలని, 100 అడుగుల రోడ్డు, సివిల్ అవియేషన్ కాలని, అయ్యప్ప నగర్, కన్నిక కాలని, లక్ష్మీ నగర్ 3వ స్టేజ్, ఎస్బీఐ కాలని 3వ స్టేజ్, రామ్ నగర్, కుబేరన్ నగర్ 10,12,17 వీధులు, రామ్ నగర్

అంబత్తూర్: కోలడి రోడ్డు, దేవి నగర్, కేపీఎస్ నగర్, అరవింద్ నగర్, డీడీఎస్ నగర్, ఈశ్వరన్ నగర్, నటేశన్ నగర్, అభిరామి నగర్, అన్బు నగర్, చెల్లయమ్మన్ నగర్, అడయాలంపట్టు, మిలీనియం టౌన్ ఫేస్ 1,2,3, స్కూల్ రోడ్డు వీధి, కంబర్ నగర్ 1 నుంచి 4 వీధులు

పల్లావరం: ఆదాం నగర్, అనకాపుత్తూర్, శంకర్ నగర్ 38 నుంచి 41 వీధులు, అప్పాస్వామి నగర్, శంకర్ నగర్ మెయిన్ రోడ్డు

వేళచ్చేరి: వేళచ్చేరి బైపాస్ 100 అడుగుల రోడ్డు, లక్ష్మీ నగర్ 1 నుంచి 6 వీధులు, రాజీవ్‌గాంధీ వీధి, ఎంజీఆర్ నగర్ 1 నుంచి 7 వీధులు, వెంకటేశ్వర నగర్ 1,2 వీధులు

300 ఏళ్ల నాటి నాయకర్ శిలాశాసనం లభ్యం

ఐసిఎఫ్, జూలై 4: తిరుచ్చి జిల్లా కొప్పంపట్టి సప్తరుషీశ్వర ఆలయంలో 300 ఏళ్ల నాటి నాయకర్ శిలాశాసనం లభ్యమైంది. హిందూ దేవాదాయ శాఖకు చెందిన ఆలయాల్లో ఉన్న శిలాశాసనాలు, తాళపత్రాలు సేకరించి వాటిని పరిశోధించేందుకు ప్రపంచ తమిళ పరిశోధన సంస్థ తాళపత్రాల శాఖ ప్రత్యేక నిపుణుల బృందాన్ని ఏర్పాటుచేసింది. ఈ బృందం వివిధ ఆలయాల్లో తనిఖీ చేసి ప్రాచీన శిలాశాసనాలు, తాళపత్రాలు గుర్తించి పరిశోధనలు చేపడుతోంది. ఈ నేపథ్యంలో, బుధవారం కొప్పంపట్టిలో ఉన్న ప్రాచీన సప్తరుషీశ్వరుడు-కుంకుమవల్లి ఆలయంలో 1718 వైకాశి మాసం 13వ తేది ఎర్రమరెడ్డి కుమారుడు వల్లకోల్ నల్లప్పరెడ్డి మనవడు ఆలయానికి భూమి దానం చేసినట్లు సూచించే శిలాశాసనం కనుగొన్నారు.

సమరయోధుల సమస్యల పరిష్కార శిబిరం

వేలూరు, జూలై 4: స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం స్వాతంత్ర్య సమరయోధుల గ్రీవెన్స్ జరిగింది. కార్యక్రమంలో కలెక్టర్ సుబ్బులక్ష్మి పలువురు సమరయోధుల నుంచి వినతిపత్రాలు స్వీకరించి, వీటిని పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కలెక్టర్ అసిస్టెంట్ కలియమూర్తి సహా పలువురు అధికారులు పాల్గొన్నారు.

'నీట్'ను విద్యార్థులు అంగీకరించారు

● బీజేపీ నేత తమిళిసై

పెరంబూర్, జూలై 4: 'నీట్' ను విద్యార్థులు అంగీకరించారని బీజేపీ నేత తమిళిసై సౌందర్‌రాజన్ తెలిపారు. తిరువాన్మియూర్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మీడియాతో మాట్లాడుతూ... నీట్ పరీక్షతో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులు కూడా వైద్య కోర్సుల్లో చేరుతున్నారన్నారు. కానీ, కొన్ని రాజకీయ పార్టీలు మాత్రం తమ స్వార్థ రాజకీయాలకు నీట్ రద్దు పేరుతో విద్యార్థుల భవిష్యత్తును కాలరాస్తున్నాయని తమిళిసై ఆవేదన వ్యక్తం చేశారు.

ఐఐటీఎంతో సిమట్స్ ఒప్పందం

చెన్నై, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మద్రాస్ (ఐఐటీఎం)తో సవీతా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ అండ్ టెక్నికల్ సైన్సెస్ (సిమట్స్) ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు 'స్వయం ప్లస్' కోర్సుకు సంబంధించిన ఒప్పందపత్రాలపై ఇరు సంస్థల ప్రతినిధులు సంతకాలు చేశారు. ఈ ఒప్పందం రెండు సంస్థల బలాలను మిళితం చేసే సమగ్రమైన, వినూత్నమైన పాఠ్యాంశాలను అభివృద్ధి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు సిమట్స్ నిర్వాహకులు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. సాంకేతిక, వైద్య రంగాల్లో విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందించేందుకు ఇది దోహద పడుతుందని తెలిపారు.



ఒప్పందపత్రాలు మార్చుకుంటున్న ఇరు సంస్థల ప్రతినిధులు

తిరువణ్ణామలై మహారథం పరిశీలన

పెరంబూర్, జూలై 4: తిరువణ్ణామలై అరుణాచలేశ్వర ఆలయ మహారథం స్థిరత్వాన్ని అధికారులు పరిశీలించారు. ఈ ఆలయంలో జరిగే 10 రోజుల కార్తీక దీపోత్సవాల్లో ఏడోరోజు పంచమూర్తుల రథోత్సవం జరుగుతుంది. అందులో 31 అడుగుల రథంలో వినాయకుడు, 31 అడుగుల రథంలో వళ్లి, దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి, 59 అడుగుల ఎత్తైన మహారథంలో ఉన్నామలై అమ్మవారు సమేత అరుణాచలేశ్వరుడు, 46 అడుగుల రథంలో పార్వతి అమ్మవారు, 26 అడుగుల రథంలో చండికేశ్వర స్వామివార్లు వేర్వురుగా మాడవీధుల్లో విహరిస్తారు. ఈ నేపథ్యంలో, మహా రథం స్థిరత్వం దెబ్బతిందని పలువురు భక్తుల ఫిర్యాదులతో, బుధవారం హిందూ దేవాదాయ శాఖ మండల స్థపతి కన్నన్, ఆలయ జాయింట్ కమిషనర్ జ్యోతి, ప్రజాపనుల శాఖ అధికారులు క్రేన్ సాయంతో రథంపై భాగాన్ని పరిశీలించారు. అనంతరం రాబోయే కార్తీక దీపోత్సవాల నాటికి, రథాన్ని మరమ్మతులు చేపట్టి సిద్ధం చేస్తామని అధికారులు తెలిపారు.



రథాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఆధ్యాత్మికం

సూర్యుడి శాపవిమోచన క్షేత్రం

లలితా నవరత్నమాల ఆవిర్భావ స్థలం

సకల సౌభాగ్యాలనిచ్చే లలితాంబికా సమేత మేఘనాథస్వామి ఆలయం

తిరువారూరు జిల్లాలో తిరుమీయచ్చూరు లలితాంబికా సమేత మేఘనాథస్వామి ఆలయం కావేరి దక్షిణ తీరాల్లోని శైవదివ్యక్షేత్రాల్లో 56వదిగా, అప్పర్, తిరుజ్ఞానసంబంధర్ కీర్తించిన పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతోంది. లోకానికి వెలుగునిచ్చే సూర్యభగవానుడికి శాపవిముక్తి కలిగించిన క్షేత్రంగా, సూర్య భగవానుడి రథసారథి అనూరుడు తపమాచరించి సర్వశక్తులు పొందిన శక్తిక్షేత్రంగా, అగస్త్యమహర్షి విరచిత 'లలితా నవరత్నమాల' ఆవిర్భావ స్థలంగా కీర్తిగడించిన ఈ ఆలయాన్ని దర్శిస్తే రోగవిముక్తులవుతారు. అమ్మవారిని దర్శించుకుంటే యువతులు వివాహం, వివాహితులు సంతానభాగ్యం పొందుతారు. ఈ ఆలయ స్వయంభులింగంపై యేడాదికి ఏడురోజులపాటు సూర్యభగవానుడు తన కిరణాలతో స్పృశించే అరుదైన క్షేత్రంగాను ఈ స్థలం ప్రఖ్యాతిగాంచింది.

- ఆంధ్రజ్యోతి, చెన్నై



క్షేత్రపురాణేశ్వరుడు



గర్భాలయ గోపురాలు

స్థలపురాణం...

పూర్వం భండాసురుడు అనే రాక్షసుడు, దేవతలను, ఋషులను హింసించి, యాగాలను ధ్వంసం చేసేవాడు. అతడి ఆగడాలను తట్టుకోలేక దేవతలు, మహర్షులు తమను అసురుడి బారి నుంచి కాపాడమంటూ పరాశక్తిని ప్రాధేయపడ్డారు. వారి మొరాలకించిన పరాశక్తిదేవి యాగగుండంలో నుంచి శ్రీచక్ర రథంలో లలితాంబికగా ఆవిర్భవించి భండాసురుడిని వధించారు. ఆ సమయంలో ఉగ్రరూపంలో ఉన్న అమ్మవారిని శాంతింపజేసే కార్యాన్ని పరమశివుడికి అప్పగించారు. పరమశివుడు లలితాంబికను శాంతింపజేసి ఉగ్రరూపం పోయి శాంత స్వరూపిణిగా మారాలంటే భూలోకానికి వెళ్ళి తపస్సు చేయమన్నారు. పరమేశ్వరుడి ఆజ్ఞానుసారం ఆమె ఈ క్షేత్రంలో 'మనోన్మణి' అనే నామధేయంతో శ్రీపురవాసినిగా తపస్సు చేసి శాంతచిత్తురాలయ్యారు. ఆ తర్వాత ఆ అమ్మవారు తన వదనంలోని 'వసిన్యాది వాక్‌దేవతలను' పిలిచి తనను సహస్రనామాలతో కీర్తించమని ఆదేశించారు. ఆ ప్రకారమే ఆ వాక్‌దేవతులు అమ్మవారిని కీర్తిస్తూ శ్లోకాలను గానం చేశారు. ఆ శ్లోకాలే 'శ్రీమాత్రే' అంటూ ప్రారంభమయ్యే 'లలితా సహస్రనామం'గా మారాయి.



ఆలయ మండపం

అనూరుడి కథ...

పూర్వం కశ్యపమహర్షికి వినత, కద్రువ అనే ఇద్దరు భార్యలు, వీరు సంతానం కోసం పరమేశ్వరుడిని ఆరాధించారు. పరమేశ్వరుడు ఆ వారికి ఓ పిండాన్ని ప్రసాదించి దానిని యేడాదిపాటు భద్రపరచమన్నారు. యేడాది తర్వాత వినత వద్దనున్న పిండం నుంచి గరుత్మంతుడు బయటపడ్డాడు. పెరిగి పెద్దయి మహావిష్ణువుకు వాహనంగా మారాడు. కద్రువ వద్దనున్న పిండం నుండి ఎవరూ జన్మించకపోవడంతో తొందరపడి ఆమె పిండాన్ని పగులగొట్టడంతో అందులో నుండి అరకొర దేహంతో ఓ బిడ్డ జన్మిస్తుంది. కద్రువ తన తొందరపాటుకు పశ్చాత్తాపపడి పరమేశ్వరుడిని క్షమించమంటూ వేడుకుంటుంది. భోలాశంకరుడు కద్రువను మన్నించి, ఆ బిడ్డ పెరిగి పెద్దయి సప్తాశ్వాలున్న సూర్యభగవానుడి రథసారథిగా ఉంటాడని తెలిపారు. అంతే కాకుండా ప్రతి సూర్యోదయ్యాన్ని ఇకపై ప్రజలంతా అరుణోదయం అంటూ పిలుస్తారని ప్రకటించారు. అనూరుడు పరమేశ్వరుడికి వీరభక్తుడై నిత్యం ఆరాధించసాగాడు. శివ దర్శనం కోసం ఘోరతపస్సు చేశాడు. వంటి నిండా లోపాలున్న అరుణుడు కైలాసం వెళ్ళలేడని సూర్యభగవానుడు హేళనగా మాట్లాడారు. ఆ మాటలను పట్టించుకోకుండా అనూరుడు తపస్సును తీవ్రతరం చేసి శివ దర్శనం పొందాడు. ఆ తర్వాత అనూరుడు తనను హేళన చేసిన సూర్యభగవానుడిని కాంతివిహీనుడయ్యేలా శపించాడు. దీంతో చింతించిన సూర్యభగవానుడు పార్వతీపరమేశ్వరులను ఏనుగుపై ఆసీనులు కావించి, ఆరాధించి మళ్ళీ కాంతిమంతుడయ్యాడు. లోకానికి వెలుగునిచ్చే సూర్యభగవానుడికి శాపవిముక్తి కలిగించిన ఆ పరమేశ్వరుడే ఈ క్షేత్రంలో 'మేఘనాథుడి'గా స్వయంభువుగా ఆవిర్భవించారు. సూర్యుడి శాపవిముక్తి సంఘటనకు సాక్ష్యంగా ఈ ఆలయ గర్భాలయంపైని విమానం ఏనుగు వెనుకభాగం 'గజపృష్ట' ఆకారంలో ఉంటోంది. సూర్యభగవానుడు నల్లటి ఆకారం నుండి విముక్తి పొందిన క్షేత్రం కనుక ఈ ప్రాంతాన్ని తమిళంలో 'మీయచ్చూర్' అని పిలుస్తున్నారు.

ఆలయవైభవం...

ఆలయంలో స్వామివారు స్వయంభువుగా భక్తులను అనుగ్రహిస్తున్నారు. ఈ క్షేత్రానికి వెళ్ళి లలితా సహస్రనామాన్ని, 'లలితా నవరత్నమాల'ను పఠించేవారికి అమ్మవారి పరిపూర్ణ అనుగ్రహం లభిస్తుందని శైవ పండితులు చెబుతారు. ఈ క్షేత్రంలోనే గరుత్మంతుడు, అనూరుడు (సూర్య రథసారథి), వాలి, సుగ్రీవుడు, యమధర్మరాజు, శనీశ్వరుడు తదితరులు జన్మించారు. ఆయుష్‌హోమం, మృత్యుంజయ హోమం ఈ ఆలయంలో నిర్వహిస్తుంటారు. నల్లేరు ఆకుకూరలతో తయారైన కుంభాన్ని స్వామివారికి సమర్పించి అన్నదానం చేస్తే దీర్ఘాయుష్షు సకల రోగాల నుండి విముక్తి లభిస్తాయి. ఈ ఆలయంలో పరమేశ్వరుడికి రెండు వేర్వేరు సన్నిధులున్నాయి. రాజగోపురం ఎదురుగా ఉన్న సన్నిధిలోని పరమేశ్వరుడిని శైవభక్త శిఖామణి తిరుజ్ఞానసంబంధర్, ఉత్తర ప్రాకార సన్నిధిలో కొలువైన ఈశ్వరుడిని మరో శైవభక్త శిఖామణి అప్పర్ ఆరాధించి, స్వామి వైభవాన్ని తెలిపే కీర్తనలను రచించి, గానం చేసి తరించారు. ఆలయ రాజగోపురం ఐదు అంతస్థులుంది. రెండో గోపురం మూడు అంతస్థుల్లో ఉంది. ఈ ఆలయానికి రెండు ప్రాకారాలున్నాయి. ఆలయంలో ప్రవేశించగానే కుడివైపు లలితాంబిక అమ్మవారి సన్నిధి దర్శనమిస్తుంది. మహామండపంలో రథ వినాయకుడు, అంతర ప్రాకారంలో నాగర్, శేక్కిళార్, సప్తమాతృకలు పూజించిన లింగాలు, అగ్నిదేవుడు, యమధర్మరాజు, ఇంద్రుడు పూజించిన లింగాలున్నాయి. ప్రాకారంలో ఇరు విమానాలకు మధ్య నిలిచి చూస్తే బ్రహ్మ, లింగోద్భవుడు (పరమశివుడు) మహావిష్ణువు త్రిమూర్తుల సన్నిధులను దర్శించవచ్చు. చండికేశ్వరుడు చతుర్ముఖాలతో అనుగ్రహిస్తున్నారు. క్షేత్ర పురాణేశ్వరుడి శిల్పం అత్యద్భుతంగా ఉంది. అందులోని అమ్మవారి ఆకారం ఓ వైపు నుంచి చూస్తే ఆగ్రహంతో, మరో వైపు నుండి చూస్తే శాంతిచిత్తురాలిగా దర్శనమిస్తుంది.



ఆలయ రాజగోపురం



సౌందర్యనాయకి

శ్రీచక్ర నాయకి....

మూలవిరాట్టు మేఘనాథుడే స్వయంభువుగా తూర్పుదిశగా కొలువుదీరి భక్తులకు దర్శనమిస్తున్నారు. అమ్మవారైన లలితాంబికకు 'సౌందర్యనాయకి' అనే పేరు కూడా ఉంది. ఈ అమ్మవారు శ్రీచక్రపీఠంపై రాజసింహాసనంలో ఆసీనులై గాంభీర్యంగా భక్తులకు కనువిందు చేస్తున్నారు. అభయ, వరద హస్త ముద్రతో, కుడి పాదాన్ని కాస్త మడిచి, ఎడమ పాదాన్ని నేలపై ఆనించి సౌందర్యవంతంగా దర్శనమిస్తున్నారు.



ఆలయ అంతరప్రాకారం

లలితా నవరత్నమాల...

లలితాంబిక వద్ద ఉపదేశం పొందినవారు హయగ్రీవులు. ఈయనే అగస్త్య మహర్షికి లలితా సహస్రనామం విశిష్టతను వివరించారు. ఆ విశేషాలను విన్న అగస్త్య మహర్షి లలితా సహస్రనామాన్ని ఎక్కడ పఠిస్తే సంపూర్ణ ఫలం లభిస్తుందని అడిగినప్పుడు హయగ్రీవులు తిరుమియచ్చూరు లలితాంబికై వద్ద పఠిస్తే లభిస్తుందని సమాధానమిచ్చారు. ఆ మేరకు అగస్త్యమహర్షి తన సతీమణి లోపముద్రను వెంటబెట్టుకుని ఈ క్షేత్రానికి వచ్చి అమ్మవారిని ఆరాధించి లలితా సహస్రనామం పఠించారు. అమ్మవారు సంతసించి ఆ పుణ్యదంపతులకు నవరత్నాలుగా దర్శనమిచ్చారు. అగస్త్యమహర్షి సంతసించి నవరత్నాలుగా దర్శనమిచ్చిన అమ్మవారి వైభవాలను తెలిపేలా 'లలితా నవరత్నమాల' పేరుతో స్తోత్రాలను పఠించారు.

చిలుకతో దుర్గమ్మ...



దుర్గమ్మ

మదురై మీనాక్షి అమ్మవారు, శ్రీవిల్లిపుత్తూరు ఆండాళ్ చేతిలో, భుజంపై చిలుకతో దర్శనమివ్వటం ఆనవాయితీ. ఆ చిలుకలను అమ్మవార్లకు మరింత శోభను చేకూర్చేందుకు అలంకరిస్తుంటారు. ఆ రెండు విగ్రహాల్లో చిలుకను శిల్పంగా చెక్కిన దాఖలాలు లేవు. అయితే ఈ ఆలయంలోని దుర్గమ్మ విగ్రహంలోనే చిలుక రూపం కూడా చెక్కబడి ఉంది. చెన్నై త్రిశూలంలోని త్రిశూలనాథర్ ఆలయం, తేని జిల్లా చిన్నమనూరు మాణిక్యవాసగర్ ఆలయంలోను తిరుమియచ్చూరు ఆలయంలోని దుర్గమ్మ చేతుల్లోనే చిలుక చెక్కబడింది. అష్టభుజాలతో గాంభీర్యంగా దర్శనమిస్తే ఈ దుర్గమ్మను 'శుకబ్రహ్మ దుర్గాదేవి' అని పిలుస్తున్నారు. ఇక్కడ 'శుకం' అంటే చిలుక అని అర్థం. ఈ అమ్మవారు మహిషాసురిడిపై నిలిచి ఉన్నప్పటికీ వదనం శాంతచిత్తంగానే ఉండటం విశేషం. ఆ శాంత స్వరూపిణి దుర్గమ్మ చేతిలో ఉన్న ఆ శుకం (చిలుకే) భక్తుల కోరికలను అమ్మవారికి నివేదించి నెరవేర్చేందుకు దోహదపడుతుందని శైవాగమ పండితులు చెబుతున్నారు. తమ వాదనలకు సాక్ష్యంగా ప్రతిరోజూ సాయంత్రం ఓ చిలుక దుర్గమ్మ సన్నిధికి వచ్చి వెళుతుండటం గురించి చెబుతున్నారు.

మూలవర్లు: మేఘనాథస్వామి, భువనేశ్వరర్
ఉత్సవమూర్తి : పంచమూర్తి
అమ్మవారు/తాయార్ : లలితాంబిక, సౌందర్యనాయకి, మేగలాంబికై
స్థలవృక్షం : మందారవృక్షం, బిల్వవృక్షం
తీర్థం : సూర్యపుష్కరిణి



మేఘనాథస్వామి

ఎలావెళ్ళాలి?

తిరువారూరు జిల్లాలోని పేరలం రైల్వేజంక్షన్‌కు కూతవేటు దూరంలో ఈ ఆలయం ఉంది. మైలాడుదురైకి రాష్ట్ర రవాణా సంస్థ బస్సుల్లో మైలాడుదురై వెళ్ళి అక్కడి నుంచి టౌన్ బస్సుల్లోనూ తిరుమియచ్చూరు ప్రాంతానికి చేరుకోవచ్చు. ఈ ఆలయాన్ని ప్రతిరోజూ ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మళ్ళీ సాయంత్రం 4.30 నుండి రాత్రి 8.30 గంటల వరకు తెరచి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.

కాలి గొలుసు కానుక...

ఈ ఆలయంలోని లలితాంబిక అమ్మవారు సకలాభరణాలతో భక్తులకు కనువిందు చేస్తున్నప్పటికీ ఆమె పాదాలకు వెండి గొలుసులు లేవు. యేళ్లతరబడి కాలి గొలుసులు లేకుండానే ఆమె దర్శనమిచ్చేవారు. ఆ నేపథ్యలో ఓ భక్తురాలికి అమ్మవారికి తన చేతుల మీదుగా వెండి గొలుసులు ధరింపజేస్తున్నట్లు కల వచ్చింది. ఈ విషయాన్ని ఆలయ నిర్వాహకులకు తెలిపినప్పుడు ఆ భక్తురాలిని అమ్మవారి పాదాలకు వెండి గొలుసులు ధరింపజేయమన్నారు. ఆ ప్రకారమే ఆ భక్తురాలు వెండి గొలుసులను అమ్మవారి పాదాలకు ధరింపజేసింది. అప్పటి నుండి ఇప్పటి వరకూ సంతానం కోసం వచ్చే వివాహితులు అమ్మవారికి పట్టీలు తయారు చేసి కానుకగా ఇస్తున్నారు. వెండి పట్టీలు కానుకగా ఇచ్చి వివాహితులు సంతానం పొందుతున్నట్లు ఆలయ నిర్వాహకులు చెబుతున్నారు. మేఘనాథస్వామివారికి భక్తులు వారి జన్మనక్షత్ర దినాల్లో ఆయుష్‌హోమం, షష్ట్యబ్దపూర్తి, సతాభిషేకం నిర్వహిస్తుంటారు. యువతులు ఆలయంలోని కల్యాణ సుందరుడికి పూలమాలలు సమర్పించి, అర్చన చేస్తే త్వరలోనే వివాహం జరుగుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. రోగపీడితులు నల్లేరు ఆకుకూర కలిపిన అన్నాన్ని తామరాకులో స్వామివారికి నైవేద్యంగా సమర్పించి ప్రసాదంగా ఆరగించి రోగ విముక్తులవుతున్నారు. స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు నిర్వహించి, వస్త్రాలు సమర్పించి భక్తులు తమ మొక్కులు చెల్లించుకుంటున్నారు.

ఆలయవిశేషాలు..

ఈ ఆలయంలో తైమాప రథసప్తమి వేడుకలు ఘనంగా జరుగుతాయి. పరమేశ్వరుడు, అంబికకు సంబంధించిన వార్షిక ఉత్సవాలన్నీ నిర్వహిస్తారు. ప్రతియేటా చిత్తిరై మాసం 21 నుండి 27 వరకు ఆలయ గర్భాలయంలోని స్వయంభులింగంపై సూర్యకిరణాలు ప్రసరిస్తాయి. ఆ వేడుకలను సూర్యపూజోత్సవాలుగా జరుపుకుంటున్నారు. ఈ ఆలయం చోళరాజులు నిర్మించిన ప్రాచీన ఆలయంగా పురావస్తు పరిశోధకులు ప్రకటించారు.

అమ్మ పాత్రలకు హీరోయిన్ల వెనుకంజ

● 'వన్ టు వన్' దర్శకుడు తిరుజ్ఞానం



'వన్ టు వన్'లో సుందర్ సి

అమ్మ పాత్రల్లో నటించేందుకు కోలీవుడ్ హీరోయిన్లు ముందుకు రావడం లేదని, అందువల్లే ఇతర భాషల హీరోయిన్లకు అవకాశాలు ఇవ్వాల్సి వస్తుందని 'వన్ టు వన్' దర్శకుడు తిరుజ్ఞానం అన్నారు. సుందర్ సి, అనురాగ్ కశ్యప్ నటించిన ఈ చిత్రంలో నీతూ చంద్ర, రాగిణి ద్వివేది, విజయ్ వర్మన్, మానస్వి ప్రధాన పాత్రలు పోషించారు. సిద్ధార్థ్ విపిన్ సంగీత స్వరాలు సమకూర్చారు. 24 హవర్స్ ప్రొడక్షన్స్ బ్యానరుపై నిర్మించిన ఈ చిత్రం ట్రైలర్ ఇటీవల విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు తిరుజ్ఞానం మాట్లాడుతూ, 'ఇది చెన్నైలో జరిగిన యాక్షన్ థ్రిల్లర్ మూవీ. బ్యాంకు అధికారిగా సుందర్ ఆయన భార్యగా రాగిణి ద్వివేది, ప్రతి నాయకుడిగా అనురాగ్ కశ్యప్ నటించారు. సుందర్ పాత్ర కంటే విలన్ పాత్ర గొప్పగా ఉంటుంది. డైలాగులను హిందీలో రాసుకుని తమిళంలో చెప్పారు. సినిమాకు 'ఒత్తైకు ఒత్తై' అనే పేరు పెట్టాలని భావించగా మరో చిత్రానికి పెట్టడంతో 'వన్ టు వన్' అని టైటిల్ పెట్టాల్సి వచ్చింది. ఆగస్టులో విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నాం' అని పేర్కొన్నారు.

నేటినుంచి సెట్స్‌పైకి 'కూలీ'



రజనీకాంత్ - లోకేష్ కనకరాజ్

సూపర్‌స్టార్ రజనీకాంత్ హీరోగా లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో తెరకెక్కనున్న 'కూలీ' చిత్రం షూటింగ్ శుక్రవారం నుంచి ప్రారంభంకానుంది. హైదరాబాద్‌లో ప్రారంభమయ్యే షూటింగ్ పది రోజుల పాటు జరుపుకోనుంది. ఆ తర్వాత చెన్నైలో వేసిన భారీ సెట్‌లో చిత్రీకరించేలా ప్లాన్ చేశారు. బంగారు స్మగ్లింగ్ నేపథ్యంలో ఈ సినిమాను దర్శకుడు లోకేష్ రూపొందించనున్నారు. ఇందులో సీనియర్ నటుడు సత్యరాజ్ ఓ ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. రజనీ - సత్యరాజ్ కలిసి దాదాపు 38 యేళ్ళ తర్వాత నటించనున్నారు. ఇతర పాత్రల్లో శృతిహాసన్, ఫహాద్ ఫాజిల్, శోభన తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించే ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాత కళానిధి మారన్ సన్ పిక్చర్స్ పతాకంపై భారీ బడ్జెట్‌తో తెరకెక్కించనున్నారు.

నాన్ రిలిజియస్ ఘోస్ట్‌గా 'పార్క్'



'పార్క్'లో ఓ దృశ్యం

అక్షయ మూవీ మేకర్స్ పతాకంపై నటరాజ్ నిర్మాణ సారథ్యంలో రూపొందిన చిత్రం 'పార్క్'. ఏ వెంకటేష్ అసిస్టెంట్ ఈకే మురుగన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. తమన్ కుమార్, శ్వేతా డోరతి హీరోహీరోయిన్లుగా నటించగా, ప్రధాన విలన్‌గా యోగిరామ్ నటించారు. ఈ సినిమా గురించి దర్శకుడు మాట్లాడుతూ, 'సినిమాను 36 రోజుల్లో పూర్తి చేశాం. ఎన్నో దెయ్యం చిత్రాలను చూస్తున్నాం. ఆ సినిమాల్లో ఆ దెయ్యం ఏదో ఒక మతానికి చెందినదిగా ఉంటుంది. కానీ, మా చిత్రంలో వచ్చే చిత్రం ఏ ఒక్క మతానికి చెందినది కాదు. మరో కోణంలో ఆ దెయ్య పాత్ర చిత్రీకరించాం. ఇలాంటి సన్నివేశాలు ఇప్పటివరకు ఏ ఒక్క చిత్రంలో రాలేదు. హర్రర్ చిత్రాలకు ఎల్లవేళలా ప్రేక్షకుల నుంచి ఆదరణ ఉంటుంది. పెట్టుబడి పెట్టే నిర్మాతలను రక్షిస్తాయి. ఈ సినిమా ఖచ్చితంగా ప్రేక్షకులను అలరిస్తుందన్న నమ్మకం ఉంది. ఆగస్టులో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం' పేర్కొన్నారు.

నయనతార గృహ ప్రవేశం



హీరోయిన్ నయనతార కొత్తగా నిర్మించిన ఇంటిలోకి గృహ ప్రవేశం చేసినట్టు వార్తలు వస్తున్నాయి. కేరళ పూర్వీకం కలిగిన నయనతార.. ఎగ్మోర్‌లోని ఒక బహుళ అంతస్తు భవనంలో ఉంటున్నారు. అయితే సూపర్‌స్టార్ రజనీకాంత్, హీరో ధనుష్, రాజకీయ నేత శశికళ వంటివారు నివాసం ఉంటున్న పోయెస్ గార్డెన్‌లో సొంతంగా స్థలాన్ని కొనుగోలు చేసి, భారీ వ్యయంతో ఇలు నిర్మించారు. ఈ ఇంటిలోకి ఆమె చడీచప్పుడు లేకుండా గృహప్రవేశం చేసినట్టు వార్తలు వస్తున్నాయి. 'మనం మంచి శుభతరుణాల్లో ఉంటున్నాం. అంతకుమించి ఏమీ లేదు' అని నయనతార తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఓ పోస్ట్ చేశారు. అలాగే, ఇంటి వాకిట్లో ఆమె నిలబడి వున్న ఫోటోను ఆమె షేర్ చేశారు.

50 నగరాల్లో స్టార్ 'హోం హెల్త్ కేర్ సేవలు'



విలేకరుల సమావేశంలో సీఈవో ఆనంద్ రాయ్

అడయార్, జూలై 4: ఆరోగ్య బీమా సేవలను అందిస్తున్న స్టార్ హెల్త్ అండ్ అలీడ్ ఇన్సూరెన్స్ కంపెనీ (స్టార్ హెల్త్ ఇన్స్యూరెన్స్) కొత్తగా హోం హెల్త్ కేర్ సేవలను ప్రారంభించింది. తొలిదశలో 50 ప్రధాన నగరాలు, పట్టణాల్లో ఈ సేవలను ప్రారంభించినట్టు ఆ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో ఆనంద్ రాయ్ వెల్లడించారు. నగరంలో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, తమిళనాడు రాష్ట్రంలో ఆరోగ్య బీమా మార్కెట్ గణనీయంగా వృద్ధి చెందుతుందన్నారు. ముగిసిన ఆర్థిక సంవత్సరంలో స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ రిటైల్ ప్రీమియం పాలసీలను 12.5 లక్షల మేరకు విక్రయించి, రూ.2 వేల కోట్లకు పైగా వ్యాపారం చేసినట్టు చెప్పారు. తమ కంపెనీ విక్రయించే పాలసీల్లో బాగా ప్రాచుర్యం పొందిన పాలసీల్లో స్టార్ ఫ్యామిలీ హెల్త్ ఆప్టిమా, స్టార్ కాంప్రహెన్సివ్ ఇన్స్యూరెన్స్, స్టార్ హెల్త్ అస్యూర్ ఇన్స్యూరెన్స్ పాలసీలు ఉన్నాయని పేర్కొన్నారు.



చెన్నైలో జరిగిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో 'చెన్నైస్ అమృత' అధినేత భూమినాథన్‌కు 'టైమ్స్ ఆఫ్ ఇండియా', టైమ్స్ ఇండరాక్ట్' తరఫున పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం